సాక్షి
రంగారెడ్డి

మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025



అల్లర్లు చేస్తే అరెస్టే..!

ఫార్మాసిటీ భూముల సర్వే, ఫెన్సింగ్ నిర్మాణ పనుల్లో పోలీసులు దూకుడు పెంచారు. 8లో▸



జయప్రదం చేయండి

ఎస్ఎఫ్ఐ 5వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ అన్నారు. 8లో▸



ప్రైవేటు పాఠశాలలు వద్దు..

ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులను చేర్పించాలని టీజీయూఎస్ జిల్లా అధ్యక్షుడు తవుర్యా నాయక్ కోరారు. 8లో▸

కోటా దాటింది!

ఉపాధ్యాయ కేటాయింపుల్లో స్థానిక రగడ

- స్పౌజ్ కేటగిరీలో జిల్లాకు మరో 32 మంది రాక
- ఇప్పటికే 50 శాతం మించిన నాన్ లోకల్ టీచర్లు
- తాజాగా మరికొంత మంది కేటాయింపుపై విమర్శలు
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా విద్యాశాఖలో మళ్లీ స్థానిక రగడ మొదలైంది. ఇప్పటికే అనేక మంది స్థానికతకు విరుద్ధంగా వచ్చి జిల్లాలో పాగా వేశారు. తాజాగా మరికొంత మంది ఉపాధ్యాయులను కేటాయించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్పౌజ్ కోటాలో ఇతర జిల్లాలకు చెందిన మరో 32 మందిని జిల్లాకు కేటాయించడాన్ని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇతర జిల్లాల వారితో ఖాళీ పోస్టులను భర్తీ చేయడం ద్వారా స్థానికంగా ఉన్న నిరుద్యోగులు తమ ఉద్యోగ అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 4,054 ఎస్‌జీటీలు, 3,997 స్కూల్ అసిస్టెంట్లు, 278 మంది హైస్కూలు ప్రధానోపాధ్యాయులు, 200 మంది ప్రైమరీ స్కూలు ప్రధానోపాధ్యాయులు పని చేస్తున్నారు. నిజానికి స్థానికేతరుల కోటా 20 శాతానికి మించకూడదు. కానీ ఇప్పటికే ఖమ్మం, నల్లగొండ, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి డిప్యూటేషన్లపై వచ్చి చేరినవారితో స్థానికేతరుల కోటా 50 శాతం దాటిపోయింది. ప్రభుత్వ తాజా కేటాయింపులపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

పలుకుబడిని అడ్డంపెట్టుకుని..

రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ నగరానికి ఆనుకుని ఉంది. ఆరోగ్య సమస్యలు, పిల్లల ఉన్నత చదువుల పేరుతో ఇతర జిల్లాలకు చెందిన ఉపాధ్యాయ సంఘాల నేతలు సహా ప్రజాప్రతినిధుల బంధువులు తమకున్న రాజకీయ, ఆర్థిక పలుకుబడిని అడ్డంపెట్టుకుని డిప్యూటేషన్లపై అడ్డదారుల్లో వచ్చి చేరుతున్నారు. వీరంతా శివారు మండలాల్లో కాకుండా నగరానికి ఆనుకుని ఉన్న సరూర్‌నగర్, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, రాజేంద్రనగర్, బాలాపూర్, ఇబ్రహీంపట్నం, శంషాబాద్, శేరిలింగంపల్లి మండలాల పరిధిలోని విద్యార్థుల సంఖ్య పెద్దగా లేని ప్రభుత్వ పాఠశాలల్లో పోస్టింగులు పొందుతున్నారు. ఏళ్ల తరబడి శివారు మండలాల్లో పని చేస్తున్న స్థానిక ఉపాధ్యాయులకు బదిలీలు, పోస్టింగ్‌ల విషయంలోనూ తీరని అన్యాయం జరుగుతోంది. అంతే కాదు ఇప్పటికే బీఈడీ, టీటీసీ వంటి కోర్సులు పూర్తి చేసుకుని డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు పోస్టులు ఖాళీ లేక ఉద్యోగాలు దొరకని పరిస్థితి నెలకొంది.

ఆ ఉత్తర్వులు రద్దు చేయాలి



భార్యభర్తల బదిలీల పేరుతో ప్రభుత్వం జిల్లాకు మరోసారి తీరని అన్యాయం చేసింది. ఇప్పటికే 50 శాతానికి మించి ఉన్న స్థానికేతరులను వారి సొంత జిల్లాలకు పంపకుండా కొత్తగా మరికొంత మంది ఉపాధ్యాయులను కేటాయించడం దారుణం. భార్యాభర్తలు ఒకే ప్రాంతంలో పని చేయాలనే ప్రభుత్వ నిబంధనను స్వాగతిస్తున్నాం. కానీ 317 జీఓను అడ్డుపెట్టుకుని ఇప్పటికే జిల్లాలో పాగా వేసిన స్థానికేతరులను వారి జిల్లాలకు పంపకుండా, తాజాగా వారి సహచరులను స్పౌజ్‌కేటగిరీలో కేటాయించడం అన్యాయం. ప్రభుత్వ తాజా నిర్ణయంతో జిల్లా నిరుద్యోగులు మరింత నష్టపోయే పరిస్థితి నెలకొంది. స్పౌజ్ కేటగిరీలో జిల్లాకు కేటాయించిన 32 మంది ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలి. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగడానికి వెనుకాడబోం.

– సత్తారి రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, పీఆర్‌టీయూ



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

ధరణి కష్టాలు.. భూ భారతితో దూరం

- రైతుల వద్దకే రెవెన్యూ సేవలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ధరణితో పడిన కష్టాలు భూ భారతితో దూరమవుతాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలోని ఓ గార్డెన్‌లో సోమవారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదలు, రైతులకు ఇచ్చిన హామీల్లో భాగంగానే ఈచట్టాన్ని తీసుకొచ్చామన్నారు. భూమి ఉండీ అమ్ముకోలేని స్థితిలో అనేక మంది ధరణితో అవస్థలు పడ్డారని గుర్తు చేశారు. ధరణితో ప్రజలు అధికారుల వద్దకు వెళ్లాల్సి వచ్చేదని, భూభారతితో అధికారులే ప్రజల చెంతకు వెళ్లి సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. గతంలో ఒక్క ఆన్‌లైన్ దరఖాస్తుకు రూ.వెయ్యి చెల్లించాల్సి ఉండేదని, ప్రస్తుతం ఆ దుస్థితి ఉండబోదని స్పష్టం చేశారు. ఇకనుంచి సర్వే మ్యాప్‌లతోనే రిజిస్ట్రేషన్లు అవుతాయని వెల్లడించారు. ఇందుకోసం 6వేల మంది ట్రైన్డ్ లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తామని వెల్లడించారు. త్వరలోనే అన్ని గ్రామాలకు రెవెన్యూ అధికారులను నియమించనున్నట్లు చెప్పారు. ఆధార్ మాదిరిగా భూధార్ కార్డులు అందించి, భూవివరాలు పొందుపరుస్తామన్నారు. అర్హులైన కౌలుదారులకు న్యాయం చేసే వెసులుబాటు ఈ చట్టంలో ఉందని తెలిపారు. భూ భారతి ద్వారా రికార్డుల్లోని తప్పొప్పులను సరిచేసే అధికారాన్ని రెవెన్యూ శాఖకు కల్పించినట్టు మంత్రి పేర్కొన్నారు. పార్ట్‌– బీలోని 18 లక్షల ఎకరాల భూ సమస్యలను పరిష్కరించే విధంగా ఈ చట్టాన్ని రూపొందించామన్నారు. ఏటా డిసెంబర్ 31న గ్రామ రెవెన్యూ అధికారి నుంచి జమాబందీ నమోదు చేయించి, రికార్డులు భద్రపరుస్తామని స్పష్టం చేశారు. చట్టంలోని అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. ప్రతీ తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్ కార్యాలయాల్లో ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న అర్హులైన వారికి పాసు పుస్తకాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆర్డీఓ అనంతరెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీపీఐఐసీ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, మార్కెట్ చైర్మన్లు గురునాథ్‌రెడ్డి, చిలుక మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

కలెక్టర్ నారాయణరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మహేశ్వరం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతితో రైతుల భూ సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతాయని కలెక్టర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణితో భూ సమస్యలు పరిష్కారం కాక రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, భూ భారతి చట్టంతో అలాంటి అవసరం రాదన్నారు. 90 శాతం సమస్యలు స్థానికంగానే పరిష్కారం అవుతాయని, 10 శాతం మాత్రమే ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలో ఉంటాయని తెలిపారు. భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసే ఉత్తర్వులపై ఏవైనా అభ్యంతరాలుంటే అప్పీలు చేసుకునే అవకాశం ఉందన్నారు. భూ భారతి చట్టం ద్వారా రైతులు, పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనంతరం రైతులు కొత్త చట్టంపై కలెక్టర్, ఆర్డీఓలను సందేహాలు అడిగి నివృత్తి చేసుకున్నారు. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ రైతులకు వివరించారు. కార్యక్రమంలో కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ సైదులు, మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణా నాయక్, వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, ఏడీఏ సుధారాణి, ఎంపీడీఓ శైలజ, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, మాజీ ఎంపీపీలు కోరుపోలు రఘుమారెడ్డి, సునీతా అంధ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



చెట్టు విరిగిపడి నిలిచిపోయిన వాహనాలు

రహదారిపై విరిగిపడిన మర్రి చెట్టు

- గంటకుపైగా ట్రాఫిక్ జాం

చేవెళ్ల: గాలిదుమారంతో హైదరాబాద్‌–బీజాపూర్ రహదారిపై ఓ పెద్ద మర్రి చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలంలో సోమవారం మధ్యాహ్నం వరకు ఎండ దంచికొట్టింది. సాయంత్రం 4 గంటల నుంచి వాతవారణం ఒక్కసారిగా మారిపోయింది. బలమైన గాలులు, పలుచోట్ల వర్షం కురిసింది. మండలంలోని ఖానాపూర్, ఆలూరు, అంతారం, కౌకుంట్ల తదితర గ్రామాల్లో జోరు వర్షం కురిసింది. బలమైన గాలులకు అంతారం బస్‌స్టేజీ సమీపంలో ఓ పెద్ద మర్రి చెట్టు విరిగి రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో రోడ్డుపై వాహనాల సంఖ్య తక్కువగా ఉండడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. రోడ్డుపై చెట్టు పడిపోవటంతో వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. గంటకుపైగా రాకపోకలు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రోడ్డుపై పడిపోయిన చెట్టును జేసీబీల సాయంతో తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

నిషా కోసం పెయిన్ కిల్లర్

- డోస్ ఎక్కువై యువకుడి మృతి
- ఆస్పత్రిలో మరో ఇద్దరు



అబ్దుల్ నాసర్ (ఫైల్)

పహాడీషరీఫ్: మత్తు కోసం పెయిన్ కిల్లర్ అలవాటు చేసుకున్న యువకుడు, మరింత నిషా కోసం డోస్ పెంచి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ కథనం ప్రకారం.. సుల్తాన్‌పూర్‌కు చెందిన ఎంఎస్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థి మహ్మద్ అబ్దుల్ నాసర్(17), షాబాజ్(22), మరో బాలుడు స్నేహితులు. కొద్ది నెలలుగా మత్తు కోసం పెయిన్ కిల్లర్ టాబ్లెట్లు తీసుకుంటున్నారు. ఎలా వాడాలనేదానిపై షాహీన్‌నగర్‌కు చెందిన సాహిల్ అనే మరో వ్యక్తి సాయం తీసుకుంటున్నారు. మొదట్లో కొద్ది స్థాయిలో పెయిన్ కిల్లర్లను తీసుకున్న వీరు మరింత నిషా కోసం మోతాదును మించి తీసుకోవడం ప్రారంభించారు. ఈనెల 17న ముగ్గురూ కలిసి పెయిన్ కిల్లర్లను తీసుకున్నారు. నాసర్ కోమాలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు అతన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మిగిలిన ఇద్దరు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

మాల్ ‘సంత’సం

- జాతీయ స్థాయిలో ‘ప్రత్యేక’ గుర్తింపు
- ఆత్మనిర్భర్ స్పెషల్ పంచాయతీ కింద ఎంపిక
- అవార్డుకు కారణమైన పశువుల సంత
- తెలంగాణ నుంచి ఎంపికైన ఏకైక గ్రామం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

ఐదేళ్లుగా పశువుల సంతతో వచ్చిన రాబడి (రూ.లక్షల్లో)

ఏడాది	వచ్చిన ఆదాయం
2021–22	రూ. 53,00,000
2022–23	రూ. 59,00,000
2023–24	రూ. 71,03,000
2024–25	రూ.73,00,000
2025–26	రూ. 82,00,000



మాల్‌లో కొనసాగుతున్న సంత

యాచారం: జాతీయ స్థాయిలో ‘ప్రత్యేక’ గుర్తింపుతో మాల్ ఒక్కసారిగా మెరిసింది. రాష్ట్రంలోనే ఆత్మనిర్భర్ పంచాయతీ స్పెషల్ అవార్డు దక్కించుకున్న గ్రామంగా నిలిచింది. రంగారెడ్డి–నల్లగొండ జిల్లాల సరిహద్దు యాచారం మండల పరిధిలోని మాల్‌కు మొదటి నుంచీ వ్యాపార కేంద్రంగా పేరుంది. ప్రతి మంగళవారం ఇక్కడ పశువుల సంతతో పాటు వ్యాపార లావాదేవీలు జోరుగా సాగుతాయి. సంత రోజు రూ.కోట్లలో ఆర్థిక లావాదేవీలు జరగడంతోపాటు వందలాది మంది ఉపాధి పొందుతారు. రంగారెడ్డి–నల్లగొండ జిల్లాల నుంచే కాకుండా నాగర్‌కర్నూల్, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాచర్ల, మార్కాపురం, చిలకలూరిపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చి తమకు కావాల్సిన సరుకులతో పాటు పాడి పశువులు, అరక దున్నే కాడెద్దులు కొనుగోలు చేస్తుంటారు. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై ఉన్న ఈ గ్రామం 70 ఏళ్లుగా వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతోంది. జాతీయ స్థాయిలో తమ గ్రామానికి గుర్తింపు రావడంపై స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

అవార్డు దక్కిందిలా..

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అవార్డులు అందజేయడం కోసం గత నెలలో 19 అంశాల ప్రగతిపై దరఖాస్తులు ఆహ్వానించింది. ఎంపీడీఓ నరేందర్ రెడ్డి మాల్ పశువుల సంత ఆర్థిక వనరులపై దృష్టి పెట్టి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఎంపీడీఓ పంపిన నివేదిక ఆధారంగా ఈ నెల మొదటి వారంలో కేంద్ర ప్రత్యేక బృందం గ్రామాన్ని సందర్శించింది. మాల్ పంచాయతీకి ఏటా పశువుల సంత వేలం పాట నిర్వహణ ద్వారా రూ.80 లక్షల వరకు ఆదాయం సమకూరుతుండడం, తద్వారా గ్రామాభివృద్ధి గణనీయంగా జరగడాన్ని గుర్తించిన అధికారుల బృందం గ్రామాన్ని ఆత్మ నిర్భర్ నేషనల్ పంచాయతీ అవార్డుకు ఎంపిక చేసింది. పశువుల సంత ద్వారా వచ్చే ఆదాయం కాకుండా పన్నుల వసూళ్లు, ఇతర అభివృద్ధి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంది. అవార్డ్‌తో పాటు రూ. కోటి పారితోషికం దక్కనుంది.

సంతకు కలగానే శాశ్వత స్థలం

ఆత్మనిర్భర్ అవార్డు రావడానికి ప్రధాన కారణమైన పశువుల సంతకు శాశ్వత స్థలం ఎంపిక కలగానే మిగిలింది. ప్రతి మంగళవారం ప్రవేట్ వెంచర్లలోని ప్లాట్లలోనే నిర్వహణ కొనసాగుతోంది. సంతకు వచ్చే మూగజీవాలకు కనీసం దాహం తీర్చేందుకు తాగు నీరు, నీడ సౌకర్యం లేదు. సంత కొనసాగుతున్న పక్కనే సర్వే నంబర్ 640 లోని 16 ఎకరాల ప్రభుత్వ భూమి నుంచి 5 ఎకరాలు కేటాయించాలని 25 ఏళ్లుగా స్థానిక ప్రజాప్రతినిధులు విజ్ఞప్తులు చేస్తున్నా ఫలితం లేకపోయింది. మాల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ సైతం ఎన్నో ఏళ్లుగా ఉంది.

ఎన్నోసార్లు అధికారుల దృష్టికి..



ఐదేళ్ల పదవీ కాలంలో మాల్ పశువుల సంతకు శాశ్వత స్థలంపై ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. గ్రామం మధ్యలోనే సర్వే నంబర్ 640లో ఐదెకరాలు కేటాయించాలని కోరినా రెవెన్యూ అధికారుల్లో చలనం లేదు. సంతకు స్థలం కేటాయిస్తే మరింత ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.

– పదకంటి కవిత, మాజీ సర్పంచ్

సంతోషంగా ఉంది



రాష్ట్రంలోనే మాల్ ఆత్మనిర్భర్ పంచాయతీ స్పెషల్ అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. అత్యధిక ఆర్థిక వనరుల కేటగిరీ కింద ఉన్నతాధికారులకు నివేదిక పంపించగా, స్వయంగా పంచాయతీని సందర్శించి అవార్డుకు ఎంపిక చేశారు. వచ్చే రూ.కోటి నగదుతో మరింత అభివృద్ధి జరుగుతుంది.

– నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ, యాచారం

స్థల కేటాయింపునకు కృషి



రాష్ట్రంలోనే ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని గ్రామం జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. మాల్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టిన పశువుల సంతకు శాశ్వత స్థలం కేటాయించేలా కృషి చేస్తా.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

ఉక్కపోత.. ఉక్కిరిబిక్కిరి

పెరుగుతున్న విద్యుత్ వినియోగం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరుగుతోంది. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులకు తోడు భరించలేని ఉక్కపోత కారణంగా గృహాలు, వాణిజ్య సంస్థలు సహా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లోనూ రోజంతా ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు ఆన్‌లోనే ఉంటున్నాయి. ఫలితంగా మీటర్లు గిర్రున తిరుగుతున్నాయి. ఆదివారంతో పోలిస్తే.. సోమవారం ఏకంగా 600 మెగావాట్లు అధికంగా నమోదు కావడం గమనార్హం. ఇదిలా ఉంటే గత ఏడాది ఏప్రిల్ 21న మధ్యాహ్నం 3.30 గంటలకు రికార్డు స్థాయిలో 3,140 మెగావాట్లు రికార్డు కాగా, తాజాగా సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఏకంగా 3,814 మెగావాట్లకు విద్యుత్ వినియోగం చేరుకోవడం విశేషం. ఇప్పుడే ఇలా ఉంటే మే చివరి నాటికి మరెంత పెరగనుందో.

తగ్గుతున్న జీరో బిల్లుల సంఖ్య..

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో 62 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో 52 లక్షలకుపైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో ప్రతి నెలా 10 లక్షల మంది 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగిస్తూ, గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లును పొందుతున్నారు. భగ్గున మండుతున్న ఎండలకు ఉక్కపోత తోడవడంతో గృహ వినియోగం రెట్టింపైంది. ఫలితంగా మార్చిలో వీరి సంఖ్య తొమ్మిది లక్షలకు పడిపోయినట్లు తెలిసింది. మే మొదటి వారంలో జారీ కానున్న (ఏప్రిల్ నెలకు సంబంధించి) బిల్లుల్లో వీరి సంఖ్య మరింత తగ్గిపోయే అవకాశం లేకపోలేదని ఇంజనీరింగ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

న్యూస్‌రీల్

సీనియర్ సివిల్ జడ్జికి ఘనంగా వీడ్కోలు



రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న న్యాయవాదులు

షాద్‌నగర్: షాద్‌నగర్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సోమవారం సిద్దిపేట కోర్టులో జడ్జిగా పని చేసిన స్వాతిరెడ్డి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న రాజ్యలక్ష్మికి బార్ అసోసియేషన్ సభ్యులు వీడ్కోలు పలికారు. బదిలీపై వచ్చిన స్వాతిరెడ్డికి న్యాయవాదులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాల్ రావు, న్యాయవాదులు కంచి రాజగోపాల్, గుండుబాయి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో శాఖల వారీగా అందిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడే పరిష్కరించే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ వారం ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 68 అర్జీలు వచ్చాయని, వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 27, ఇతర శాఖలకు సంబంధించి 41 ఉన్నట్లు తెలిపారు. వాటిని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

రాచకొండ సీపీ సుధీర్‌బాబు



సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ

ఇబ్రహీంపట్నం: పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, పోలీసు అధికారుల పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలు సమీక్షించేందుకు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, రికార్డుల నిర్వహణ, పెట్రోలింగ్, సిబ్బంది పనితీరుపై ఆయన ఆరా తీశారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని, మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీపీ సూచించారు. సీపీ వెంట ఏసీపీ రాజు, సీఐ జగదీశ్ ఉన్నారు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



దీపిక (ఫైల్)

మీర్‌పేట: ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హస్తినాపురం టీచర్స్ కాలనీలో నివసించే ఆకుల దీపిక (38) రెండున్నరేళ్లుగా నాగోలు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఆమెకు భర్త రవికుమార్, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏంజరిగిందో తెలియదు సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన కుమార్తె విషయాన్ని గమనించి వెంటనే తండ్రికి సమాచారం అందించింది. సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. దీపిక ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులా, మరేవైనా కారణాలా అనేది తెలియరాలేదు. ఆమె తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయండి



నూతన సభ్యులతో ప్రణయ్

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్

చేవెళ్ల: ఎస్‌ఎఫ్‌ఐ 5వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ అన్నారు. చేవెళ్ల మండల కేంద్రం అంబేడ్కర్ భవన్‌లో సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి అరుణ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని, దీనికి నిరసనగా రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అరకొర నిధులతో విద్యాభివృద్ధి కుంటుపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానం అమలు చేయాలంటే దేశ వ్యాప్తంగా రూ.4లక్షల 82వేల కోట్లు అవసరమని, కానీ బడ్జెట్‌లో రూ.125 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. విద్యారంగానికి జరుగుతున్న అన్యాయంపై చర్చించి, భవిష్యత్ పోరాటాల కోసం జిల్లాలో అన్ని స్థాయిల్లో మహాసభలు జరుపుకొని, రాష్ట్ర మహాసభలను ఖమ్మంలో ఈ నెల 25,26,27 తేదీలలో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ సభకు విద్యార్థులు, మేధావులు, పుర ప్రముఖులు, ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

నూతన కమిటీ..

సమావేశంలో ఫెడరేషన్ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎ.శ్రీనివాస్, అరుణ్‌కుమార్‌లు, ఉపాధ్యక్షులుగా సమీర్, యశ్వంత్, వివేకానంద, దిలీప్, సహాయ కార్యదర్శులుగా చరణ్‌గౌడ్, చందు, తేజ, పండు, సోషల్‌మీడియా కన్వీనర్‌గా చిరంజీవి, సాయి గణేశ్, డివిజన్ కమిటీ సభ్యులు దేవేందర్, సాయిగౌడ్, రాహుల్, హరికృష్ణ, బన్నీ, నవీన్, శశాంక్‌లను నియమించారు.

ఫేస్‘బుక్కై’పోయాడు!

ఫేస్‌బుక్ ద్వారా నగరవాసికి నేరగాడి ఎర

- అమెరికాలో సర్జన్‌గా పరిచయం
- డాలర్లు తెస్తూ కస్టమ్స్‌కు చిక్కానని ఫోన్
- ట్యాక్స్ పేరుతో రూ.1.55 లక్షలు స్వాహా

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సుదీర్ఘ కాలం తర్వాత మరో కస్టమ్స్ ఫ్రాడ్ కేసు నమోదైంది. నగరానికి చెందిన ఓ వ్యక్తికి ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన నేరగాడు కస్టమ్స్ అధికారుల పేరు చెప్పి రూ.1.55 లక్షలు కాజేశాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు చేపట్టారు. సికింద్రాబాద్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగికి దాదాపు రెండు నెలల క్రితం ఫేస్‌బుక్ ద్వారా ఓ ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. అమెరికాలో ఉంటున్న సర్జన్ హెన్రీ రాబర్ట్ అంటూ ప్రొఫైల్ ఉండటంతో నగరవాసి యాక్సెప్ట్ చేశాడు. ఆపై వాట్సాప్ కాల్స్ చేసిన రాబర్ట్ నగరవాసితో పరిచయం పెంచుకుని స్నేహం చేశాడు. తాను త్వరలోనే భారత్‌కు వస్తున్నానని, హైదరాబాద్ వచ్చి కలుస్తానని చెప్పాడు. పూర్తిగా నమ్మించేందుకు డమ్మీ ఫ్లైట్ టిక్కెట్స్ ఫొటోలను పంపాడు. కొన్ని రోజులకు బాధితుడికి కాల్ చేసిన రాబర్ట్ తాను ముంబై విమానాశ్రయంలో దిగానని, తన వద్ద లెక్కలు చెప్పని 1.2 లక్షల డాలర్లు ఉన్నాయని నమ్మించాడు. దీంతో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారన్న రాబర్ట్ పన్ను చెల్లించకపోతే నగదుతో పాటు తన లగేజీ సైతం జప్తు చేస్తారని చెప్పాడు. ఆపై ముంబై ఎయిర్‌పోర్టు కస్టమ్స్ అధికారిగా మాట్లాడిన మరో వ్యక్తి రాబర్ట్ రూ.1.55 లక్షలు పన్ను చెల్లించాలని చెప్పాడు. తాను బయటకు వచ్చాక ఆ మొత్తం ఇచ్చేస్తాంటూ రాబర్ట్ చెప్పంతో నమ్మిన నగర వాసి ఆ మొత్తం వాళ్లు చెప్పిన ఖాతాల్లోకి బదిలీ చేశాడు. చివరకు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించడంతో కేసు నమోదైంది.

ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లో నిందితుడి అరెస్టు

నగరానికి చెందిన బాధితుడి (68) నుంచి ఏళ్ల బాధితుడి నుంచి ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రూ.52,29,500 కాజేసిన కేసులో ఓ నిందితుడిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సోషల్‌మీడియా ద్వారా బాధితుడికి ఎర వేసిన సైబర్ నేరగాళ్లు 5పైసా క్యాపిటల్ లిమిటెడ్, బార్‌క్లేస్, షాండా క్యాపిటల్ గ్రూప్ లిమిటెడ్‌ల్లో పెట్టుబడుల పేరు చెప్పారు. ఓ టెలిగ్రాం గ్రూపులో సభ్యుడిగా చేర్చి ప్రియా అగర్వాల్, గౌరవ్ ముంజాల్ పేర్లతో ఇరువురు సలహాలు సూచనలు ఇచ్చారు. తాము చెప్పినట్లు పెట్టుబడులు పెడితే భారీ లాభాలంటూ నిండా ముంచారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఘజియాబాద్‌కు చెందిన ప్రతీక్ శుక్లాను అరెస్టు చేశారు. అతడిపై దేశ వ్యాప్తంగా తొమ్మిది కేసులు ఉన్నట్లు గుర్తించారు.

పశువుపై యువకుడి అసభ్య ప్రవర్తన

మహేశ్వరం: పశువుపై అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిని స్థానికులు పట్టుకుని చితకబాది, పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంఖాల్ గ్రామానికి చెందిన ఓ రైతు.. డయిరీ ఫాంలో కొన్ని రోజులుగా తన పశువులను కట్టేస్తున్నాడు. ఉదయం చూసే సరికి అవి గుంజ దగ్గరికి కట్టేసి ఉండేవి. ఇది గమనించిన రైతు ఎవరైనా దొంగలు వస్తున్నారా? మరేదైనా కారణం ఉందా అనే అనుమానంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో ఓ యువకుడు గేదేలపై అసభ్యంగా ప్రవర్తించడం రికార్డ్ అయింది. కాపుగాసి సదరు యువకుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

నిజాంపేట్ : కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి లోనైన ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముచ్చర్ల గ్రామానికి చెందిన వెంకటేష్ (30) శ్వేత దంపతులు బాచుపల్లిలో నివాసం ఉంటున్నారు. భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో రెండు నెలల క్రితం శ్వేత పుట్టింటికి వెళ్లిపోవడంతో అప్పటి నుంచి వెంకటేష్ ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో శ్వేత నర్సాపూర్‌లో భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం అతను పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వచ్చాడు. సోమవారం ఆమెతో మాట్లాడేందుకు వెంకటేష్ అక్క సుక్కమ్మ, తల్లి అంజమ్మ బాచుపల్లికి వచ్చారు. స్నానం చేసేందుకు తల్లి,సోదరితో కలిసి బాచుపల్లిలోని బైరుని చెరువుకు వెళ్ళాడు. అక్క, తల్లి వారిస్తున్నా లోపలికి వెళ్లిన వెంకటేష్ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. దీంతో అతడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డీఆర్‌ఎఫ్, గజ ఈతగాళ్ల గసహాయంతో వెంకటేష్ మృతదేహాన్ని బయటికి తీశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అల్లర్లు చేస్తే అరెస్టే..!

ఫార్మాసిటీ భూముల సర్వే, ఫెన్సింగ్ నిర్మాణ పనుల్లో పోలీసులు దూకుడు పెంచారు. పనులకు ఆటంకం కలిగిస్తున్నవారిపై కన్నెర్ర చేస్తున్నారు. అల్లర్లు చేస్తే అరెస్టు చేస్తామని హెచ్చరిస్తున్నారు. నష్టపోయిన రైతులకు న్యాయం చేసేందుకు అధికారులు యత్నిస్తున్నారు.

వేగంగా ఫార్మాసిటీ భూముల సర్వే

- ఫెన్సింగ్ పనుల్లో పోలీసుల దూకుడు
- ప్రజల్లో భయాందోళన కలిగిస్తున్న వైనం
- పరిహారం ఇప్పిస్తామంటూ అధికారుల భరోసా
- మే నెలలో భూములను పరిశీలించనున్న సీఎం



నక్కర్తమేడిపల్లి-నానక్‌నగర్ మధ్య కొనసాగుతున్న సర్వే, ఫెన్సింగ్ పనులు పరిశీలిస్తున్న సీఐ కృష్ణంరాజు



నానక్‌నగర్ గ్రామంలో పనులను పర్యవేక్షిస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

యాచారం: ఫార్మాసిటీ భూముల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. సేకరించిన భూముల సర్వే, ఫెన్సింగ్ పనుల్లో బాధితులతో పాటు.. పరిహారం పొందిన వారు కూడా తరచూ పనులు అడ్డుకుంటుండంతో సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం, పోలీసులకు ఫుల్ పవర్ ఇచ్చింది. దీంతో పనులకు ఎలాంటి అడ్డంకి కలిగినా క్షణాల్లో వాలిపోతున్నారు. పది రోజుల క్రితం నక్కర్తమేడిపల్లి గ్రామం నుంచి ఫార్మా భూముల సర్వే, ఫెన్సింగ్ పనులు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నుంచి భూములు సేకరించిన రెవెన్యూ శాఖ, డబ్బులు ఇచ్చిన టీజీఐఐసీ కంటే పోలీస్ శాఖనే అప్రమత్తంగా ఉంది. మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి పర్యవేక్షణలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు బందోబస్తును ఏర్పాటు చేస్తుండగా, సమన్వయ బాధ్యతలను గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు పర్యవేక్షిస్తున్నారు.

పోలీసు పహారాలో..

భూముల సర్వే, ఫెన్సింగ్ నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా.. డీసీపీ పర్యవేక్షణలో అడిషనల్ డీసీపీ, ముగ్గురు ఏసీపీలు, 8 మంది సీఐలు, 15 మంది ఎస్‌ఐలు, మరో వంద మందికి పైగా సిబ్బంది నిత్యం పహారా కాస్తున్నారు. భూములు సేకరించిన నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లోని రోడ్లపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. భూసేకరణలో నిజంగానే రైతులకు అన్యాయం జరిగినట్లు తెలిస్తే.. వారి సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, కోర్టు కేసులున్న భూముల వద్దకు వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇంటెలిజెన్సి పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు.

సీఎంఓ నుంచి పర్యవేక్షణ

ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో ఫ్యూచర్(ఫోర్త్) సిటీని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగానే గత ప్రభుత్వం సేకరించిన 14 వేల ఎకరాల భూమికి పక్కాగా సర్వే చేసి, ఫెన్సింగ్ పనులు చేపట్టింది. పలు ప్రముఖ సంస్థలకు భూములు అప్పగించడానికి నిర్ణయించిన కాంగ్రెస్ సర్కార్.. రైతులు, ప్రజల నుంచి ఏ సమస్య రాకుండా సీఎంఓ కార్యాలయం నుంచి నిత్యం పర్యవేక్షిస్తోంది. పోలీస్, రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులకు సలహాలు, సూచనలు చేస్తోంది. నెల రోజుల్లో సర్వే, ఫెన్సింగ్ పూర్తి చేయాలని నిర్ణయించింది. కొన్ని నిర్మాణ సంస్థలకు కావాల్సిన భూమిని అప్పగించి, మే నెల చివరి వారంలో సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

బాధితులకు భరోసా

భూ సేకరణలో చాలా మందికి పరిహారం అందలేదని, నకిలీ పత్రాలతో కొందరు రూ.కోట్లు దండుకున్నారని పేర్కొంటూ పలువురు రైతులు సర్వే, ఫెన్సింగ్ పనులను అడ్డుకుంటున్నారు. ఏళ్లుగా కబ్జాలో ఉన్న తమకు అన్యాయం జరిగిందని ఆందోళన చేస్తున్నారు. దీంతో పోలీసులు.. రెవెన్యూ, టీజీఐఐసీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. పల్లెచెల్కతండాలో 20 మందికి పైగా గిరిజనులు, కుర్మిద్దలో పది మందికి పైగా పేదలు, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి గ్రామాల్లో మరో 40 మంది.. హక్కుదారులమైన మాకు పరిహారం ఇవ్వకుండా, దళారులకు ఇచ్చారని ఫిర్యాదు చేశారు. ఇదే అంశాన్ని ఏసీపీ కేపీవీ రాజు.. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆ భూములను పరిశీలించేలా చేశారు. దీంతో భరోసా కలిగిన రైతులు.. సర్వే, ఫెన్సింగ్ పనులకు సహకరిస్తున్నారు.



బాధిత రైతులతో ఆర్డీఓ అనంత్‌రెడ్డిని కలిసి మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బలవన్మరణం

కుత్బుల్లాపూర్: అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.తమిళనాడుకు చెందిన అముదన్ విజయ్(23) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ కొంపల్లి సెంట్రల్ పార్కు సమీపంలోని హాస్టల్‌లో ఉంటున్నాడు. గత కొన్నాళ్లుగా ఫిట్స్‌తో బాధపడుతున్న అతను మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం హాస్టల్ భవనం పైనుంచి కిందకు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని అతడిని సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అదే రోజు మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు పాఠశాలలు వద్దు..

- సర్కారు బడుల్లో పిల్లలను చేర్పించండి
- టీజీయూఎస్ జిల్లా అధ్యక్షుడు తవుర్యానాయక్

నందిగామ: అన్ని వసతులు, అర్హతగల ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులను చేర్పించాలని టీజీయూఎస్(తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం) జిల్లా అధ్యక్షుడు తవుర్యా నాయక్ అన్నారు. ఇప్పటికే సర్కారు బడుల్లో చదువుతున్న వారిని ప్రైవేటు బాట పట్టించవద్దని కోరారు. మండల పరిధి బండకుంటతండా, బండమీదితండాలలోని ప్రాథమిక పాఠశాలలకు సోమవారం సంఘం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తండాలలో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. వాటిని బలోపేతం చేసేందుకు ప్రజలు సహకరించాలని సూచించారు. నిరుపేదలు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పిస్తూ అప్పుల బారిన పడుతున్నారని, అలా కాకుండా నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలను ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం, వారానికి రెండు సార్లు గుడ్లు, రాగి జావ, డిజిటల్ టీచింగ్, వర్క్ బుక్కులు, ఏఐ టీచింగ్ తదితర అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్ రాథోడ్, దీప్తి నాయక్, రాజశేఖర్, చందు నాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో ఉపాధ్యాయ బృందం

పౌరసరఫరాల అధికారికి సన్మానం

బడంగ్‌పేట్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన పౌరసరఫరాల జిల్లా అధికారిని వనజాతరెడ్డి(డీఎస్‌ఓ)ను సోమవారం రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా అధ్యక్షుడు పి.లక్ష్మీనారాయణగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలని డీలర్లు కోరారు. ఇందులో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సి.సత్తయ్య, కార్యవర్గ సభ్యులు భానుగౌడ్, విజయ్‌సూర్య, కృష్ణగౌడ్, సందీప్‌గౌడ్, సంఘం మహేశ్వరం మండల అధ్యక్షుడు ఎంఏ సత్తార్, మొయినాబాద్ డీలర్ల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, బాలాపూర్ రేషన్ డీలర్లు సురేష్‌గుప్తా, వినయ్‌గౌడ్, రాజుయాదవ్, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.



పౌరసరఫరాల అధికారిని సన్మానిస్తున్న డీలర్లు

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

కేతేపల్లి: ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైంది. ఈ ఘటన విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ వద్ద సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం ఇస్నాపూర్‌లో నివాసముంటున్న వి.వెంకట్రావు చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం తన భార్యతో కలిసి కారులో హైదరాబాద్ నుంచి విజయవాడకు బయల్దేరాడు. మార్గమధ్యలో కొర్లపహాడ్ వద్దకు రాగానే కారు ఏసీలో నుంచి నుంచి పొగలు వచ్చాయి. ఇది గమనించిన వెంకట్రావు దంపతులు కారును రోడ్డు పక్కకు నిలిపి కిందకు దిగారు. వెంటనే ఇంజన్‌లో మంటలు చెలరేగి నిమిషాల వ్యవధిలోనే కారుకు అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. నకిరేకల్ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివతేజ తెలిపారు.



మంటల్లో దగ్ధమవుతున్న కారు

నీటి సంపులో యువతి అస్థిపంజరం

కవాడిగూడ: లోయర్ ట్యాంక్ బండ్, డీబీఆర్ మిల్స్‌లోని నీటి సంపులో గుర్తుతెలియని యువతి అస్థిపంజరం బయటపడింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన ఆదివారం దోమల గూడ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. డీఆర్‌ఆర్‌మిల్స్ 40 ఏళ్ల క్రితమే మూతపడింది. సెక్యూరిటీ సిబ్బంది ఆదివారం సాయంత్రం మూత్ర విసర్జన కోసం పురాతన భవనం వైపు వెళ్లాడు. అనంతరం నీటి కోసం 3వ అంతస్తులో ఉన్న సంపు మూత తెరిచి చూడగా యువతి మృత దేహం కనిపించింది. దీంతో అతను వెంటనే దోమల గూడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం ఉదయం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి వయస్సు 25 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉంటుందని భావిస్తున్నారు. ఆరు నెలల క్రితం ఆమెను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి, సంపులో పడవేసి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. మృత దేహం పూర్తిగా కుళ్లిపోవడంతో నీటి సంపును పగలగొట్టారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. గుర్తుతెలియని వ్యక్తులు సదరు యువతిని ఇక్కడికి తీసుకువచ్చి అత్యాచారం చేసి హత్య చేసి ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తీసుకెళ్లలేని పరిస్థితి ఉండటంతో గాంధీ ఆసుపత్రి ఫోరెన్సిక్ సిబ్బందిని రప్పించి సోమవారం మధ్యాహ్నం అక్కడే పోస్టు మార్టం నిర్వహించారు.



డీబీఆర్ మిల్‌లోని సంపును పగలుగొడుతున్న దృశ్యం

కారులో వచ్చి.. కత్తులతో బెదిరించి

బంగారు నగలు, నగదు అపహరణ

రాజేంద్రనగర్: కత్తులతో ఇంట్లోకి దూరిన నలుగురు యువకులు భార్యాభర్తలను బెదిరించి ఆరు తులాల బంగారు ఆభరణాలు, రూ. 20 వేల నగదు, 20 తులాల వెండి వస్తువులతో ఉడాయించారు. షిఫ్ట్ కారులో వచ్చిన నిందితులు ముఖాలకు మాస్కులు ధరించి 10 నిమిషాల్లో దొంగతనానికి పాల్పడి దర్జాగా వెనుతిరిగారు. రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బండ్లగూడ సన్‌సిటీ బీ-బ్లాక్‌లో మహ్మద్ షాకీర్ తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. రెండస్తుల భవనంలో కింది భాగంలో షాకీర్, పై భాగంలో అతని సోదరుడు ఉంటున్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు షాకీర్ పని చేసుకుంటుండగా అతడి భార్య వంట గదిలో వంట చేస్తుంది. ఇంటి గేటును తట్టడంతో కుమార్తె వెళ్లి గేటు తీసింది. తెల్లటి షిఫ్ట్ కారులో వచ్చిన ఐదుగురు నిందితుల్లో ఒకరూ కారు నడుపుతుండగా నలుగురు గేట్ తీయగానే కత్తులతో ఇంట్లోకి దూసుకొచ్చారు. ఇద్దరు షాకీర్‌ను చంపుతామని కత్తి మెడకు పెట్టగా.. మరో ఇద్దరూ షాకీర్ భార్య వద్దకు వెళ్లి అరిస్తే చంపుతామని హిందీలో మాట్లాడుతూ విలువైన వస్తువులు ఇవ్వాలంటూ సూచించారు. షాకీర్ భార్య అల్మారాలో ఉన్న 6 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి వస్తువులు, రూ.20 వేల నగదు ఇచ్చింది. నిందితులు వాటిని తీసుకొని ఇంటికి బయటి నుంచి గడియ పెట్టి పారిపోయారు. షాకీర్ వద్ద సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఉన్నప్పటికీ నిందితులు వాటిని ముట్టుకోలేదు. నిందితులు సన్‌సిటీ ప్రధాన రహదారి బండ్లగూడ మీదుగా శివారు వైపు వెళ్లిపోయారు. దొంగలు వెళ్లిన అనంతరం భార్యభర్తలు కేకలు వేయడంతో పై అంతస్తులో ఉన్న కుటుంబ సభ్యులు గడియ తీయగా దోపిడీ విషయం తెలిసింది. దీనిపై సమాచారం అందడంతో రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో సంఘటన స్థలానికి చేరుకున్నారు. నిందితులంతా జీన్స్ ప్యాంట్, టీ-షర్టులు ధరించారని.... 30 ఏళ్ల లోపే ఉన్నారని బాధితుడు తెలిపాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

సీసీ కెమెరాల్లో నిక్షిప్తం

షాకీర్ ఇంటి వద్ద ఉన్న మరో ముందు నివాసం ముందు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో నిందితులు వచ్చిన దృశ్యాలన్ని రికార్డు అయ్యాయి. కారులో రావడం... కారును ఇంటి ముందు ఆపి నలుగురు యువకులు వెళ్లడం... తిరిగి ఐదు నిమిషాల్లోనే పరుగెత్తుకుంటూ రావడం తదితర దృశ్యాలన్నీ రికార్డు అయ్యాయి. సీసీ కెమెరా పుటేజీలను సేకరించిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేలిముద్రలు పట్టించాయి

మాజీ మంత్రి పొన్నాల ఇంట్లో చోరీ కేసులో ముగ్గురి రిమాండ్..

ఫిలింనగర్: మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఇంట్లో నగలు, నగదు దొంగిలించిన ఘటనలో ముగ్గురు నిందితులను ఫిలింనగర్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-92లో నివసించే మాజీ మంత్రి పొన్నాల, ఆయన భార్య అరుణాదేవి జనవరి 10న ఇంటికి తాళం వేసి సమీపంలోని టీటీడీ టెంపుల్‌కు వెళ్లారు మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించి అల్మారా తెరిచి చూడగా.. అందులోని రూ.1.50 లక్షల నగదు, విలువైన ఆభరణాలు కనిపించలేదు. దీంతో బాధితురాలు అరుణా దేవి ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్రైమ్ పోలీసులు క్లూస్ టీంతో ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు. ఇదిలా ఉండగా జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-87లో పది రోజుల క్రితం ఓ వ్యాపారి ఇంట్లో చోరీ యత్నం జరిగింది. ఆ ఘటనలో నిందితుడిని రెడ్ హ్యాండెడ్‌గా ఫిలింనగర్ పోలీసులకు అప్పగించారు. సదరు నిందితుడికి సంబంధించిన వేలిముద్రలను తీసుకుని ట్యాలీ చేయగా, పొన్నాల లక్ష్మయ్య ఇంట్లో దొంగతనానికి పాల్పడిన నిందితుడి వేలిముద్రలతో సరిపోయాయి. దీంతో అతడిని విచారించగా మాజీ మంత్రి ఇంట్లో దొంగతనానికి పాల్పడింది తానే నని అంగీకరించాడు. ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌కు చెందిన రాజ్‌కుమార్‌పాండే గత పదేళ్లుగా నగరంలో కారు డ్రైవర్‌గా పని చేస్తూ జల్సాలకు అలవాటుపడ్డాడు. ఈజీ మనీ కోసం చోరీలకు పాల్పడుతున్న అతను స్నేహితులతో కలిసి పొన్నాల ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డట్లుగా గుర్తించారు. ఈ ఘటనలో మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తేలింది. రాజ్‌కుమార్ పాండేతో పాటు ఆమె ఇద్దరు స్నేహితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు.